క్లుప్తంగా

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సౌజన్య

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని రాయరావు సరస్వతి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ సౌజన్య మాట్లాడుతూ.. ఇటీవల గుండె సంబంధిత మరణాలు తరచూ సంభవిస్తున్నాయన్నారు. దీంతో తక్షణంగా వైద్య సేవలు అందించేందుకు సీపీఆర్ ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా గుండె సంబంధిత మరణాలు సంభవిస్తున్నాయని, దీనికి సీపీఆర్‌తో తక్షణ ఉపశమనం కలిగించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, లెక్చరర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

వరి పంటల పరిశీలన



వరి పంటను పరిశీలిస్తున్న ఏఈ రాజశేఖర్‌గౌడ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులు సరైన నివారణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్‌గౌడ్ అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని శివారులో వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి సాగులో దోమపోటు, సుడిదోమ, కంకినల్లి, మెడవిరుపు వంటి తెగుళ్లను గమనించామన్నారు. సుడిదోమ నివారణకు పొలంలో నీటిని తగ్గించడంతో పాటు, ట్రిఫ్లూమెజోపైరం, లేదా, ఇమిడాక్లోప్రిడ్ 40 ఎంఎల్, లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే వరిలో కంకినల్లి నివారణకు స్పైరోమెసిఫేన్ 1 ఎంఎల్, లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అదేవిధంగా మెడవిరుపు తెగుళ్ల నివారణకు ట్రైసైక్లోజల్ 0.6 గ్రాము లేదా కాసుగా మైసిన్ 2.5 ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు అనిత, కృష్ణవేణి, రైతులు రాంరెడ్డి, రాజు, అశోక్, సంగయ్య తదితరులు పాల్గొన్నారు.

లెక్చరర్‌ను నియమించాలని విద్యార్థినుల రాస్తారోకో



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థినులు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలోని బాలికల గిరిజన క్రీడా గురుకులంలో మ్యాథ్స్ లెక్చరర్ కోసం ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులు గాంధీ చౌరస్తా వద్ద రాస్తారోకో చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ ఇంటర్ సెకండియర్ చదువుతున్న తమకు ఆరు నెలలుగా మ్యాథ్స్ లెక్చరర్ లేకపోవడంతో పాఠాలు బోధించడం లేదన్నారు. పరీక్షలు సమీపిస్తున్నందున వెంటనే మ్యాథ్స్ బోధించేలా చర్యలు తీసుకోవాలని నిరసన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం గురుకులం సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

ప్లాట్ల స్థలాలు ఇవ్వాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న మర్పల్లి గ్రామస్తులు

రేగోడ్(మెదక్): మండలంలోని మర్పల్లిలో గత ప్రభుత్వం ఇచ్చిన ప్లాట్లను తిరిగి ఇవ్వాలని గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులు సోమవారం తహసీల్దార్ దత్తారెడ్డికి వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని 150 సర్వే నంబర్‌లో సుమారు 75 గజాల చొప్పున 246 మందికి ప్లాట్ల కేటాయింపుతోపాటు స్థలాలను కూడా చూయించారని తెలిపారు. కానీ కొంతమంది తామే పట్టాదారులమంటూ ఆ ప్లాట్లను దున్నేశారని చెప్పారు. తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

నేడు వాహనాల వేలం

జహీరాబాద్ టౌన్: తనిఖీల్లో పట్టుబడిన వాహనాలను జిల్లా అధికారి ఆదేశాల మేరకు ఈ నెల 14న బహిరంగ వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ రమేశ్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ అధికారుల తనిఖీ, దాడుల్లో 9 వాహనాలు పట్టుబడ్డాయన్నారు. పట్టణంలోని కార్యాలయ ఆవరణలో ఉ. 11 గంటలకు వేలం వేస్తామన్నారు.

అద్దె భవనంలోనే..!

ఒకే భవనంలో రెండు పాఠశాలల కొనసాగింపు

- ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు
- ఏళ్లు గడిచినా సొంత భవనానికి నోచుకోని వైనం



అద్దె భవనంలో కొనసాగుతున్న ఎంజేపీ రెసిడెన్షియల్ పాఠశాల

హవేళిఘణాపూర్(మెదక్): మండల కేంద్రంలోని ఎంజేపీ బాలికల వసతి గృహంలో మెదక్, హవేళిఘణాపూర్ రెండు పాఠశాలల విద్యార్థినులు దాదాపు వెయ్యి మందికి పైగా విద్యనభ్యసిస్తున్నారు. గత ప్రభుత్వం ఎంజేపీ బాలికల పాఠశాలను వైపీఆర్ భవనంలో ప్రారంభించింది. అలాగే మెదక్‌కు మంజూరైన పాఠశాలకు భవనం లేకపోవడంతో ఇదే భవనంలో కొనసాగిస్తున్నారు. అయితే గతంలో హవేళిఘణాపూర్ పాఠశాలలో 10వ తరగతి వరకు ఉండగా.. ఆ తర్వాత ఉన్నతాధికారులు అప్‌గ్రేడ్ చేస్తూ ఇంటర్ వరకు పొడిగించారు. దీంతో రెండు పాఠశాలలతో ఇంటర్ విద్యార్థులు కలిసి మొత్తం వెయ్యికి మందికిపైగా విద్యార్థులు ఈ భవనంలోనే విద్యనభ్యసిస్తున్నారు.

ప్రభుత్వ స్థలాలు ఉన్నా..లేనట్టేనా!

హవేళిఘణాపూర్‌లో ప్రభుత్వ స్థలాలు ఉన్నప్పటికీ విద్యార్థులకోసం ప్రత్యేక భవనం నిర్మించిన దాఖలాలు లేవు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచుతున్న అధికారులు శాశ్వత భవనం దిశగా ఆలోచించకపోవడం గమనార్హం. అయితే ఇతర భవనాలకు ప్రభుత్వ స్థలాలు కేటాయిస్తున్నా.. అద్దె భవనంలో కొనసాగుతున్న ఎంజేపీ పాఠశాలలకు మాత్రం సొంత భవనానికి స్థలం కేటాయిస్తామన్న ఆలోచన రాకపోవడం అధికారుల పనితీరుకు నిదర్శనమని అనుకుంటున్నారు. దీంతోపాటు వైపీఆర్ భవనంలో బాలుర పాఠశాలను కొనసాగిస్తున్నా సొంత భవనం లేక నానా అవస్థలు పడుతున్నారు.



హవేళఘణాపూర్ శివారులో ఉన్న ప్రభుత్వ భూమి

విద్యార్థుల అవస్థలు..

ఎంజేపీ పాఠశాలలో వెయ్యి మందికిపైగా విద్యార్థులు ఉండడంతో బాత్‌రూమ్, నీటి వసతి సరిపోకపోవడంతో విద్యార్థినులు రాత్రి వేళల్లో నిద్రలు లేకుండా స్నానాలు చేసుకోవాల్సిన వస్తోందని అంటున్నారు. కొంతమంది స్నానాలు చేయకపోవడంతో వ్యాధులు సోకే అవకాశాలున్నాయి. కొంతకాలంగా విద్యార్థులు అవస్థలు పడుతుండగా అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం ఏంటని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

ఖాళీ చేయాలని నోటీసులు

మండల కేంద్రంలోని వైపీఆర్ భవనంలో కొనసాగుతున్న ఎంజేపీ పాఠశాలను ఖాళీ చేయాలని గతంలో పలుమార్లు యాజమాన్యాలు నోటీసులు ఇచ్చినా స్పందించలేదు. దీంతో దసరా సెలవుల సందర్భంగా పాఠశాల భవనానికి తాళం వేయగా.. జిల్లా అధికారితో మాట్లాడి తిరిగి ఏడాది వసరే కొనసాగించేందుకు అనుమతిచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శాశ్వత భవనం కోసం స్థలం కేటాయించి విద్యార్థుల చదువులకు ఇబ్బంది లేకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కార్మికులకు న్యాయం చేయండి

చేగుంట(తూప్రాన్): ఏపీఎల్ అపోలో పరిశ్రమ కార్మికులకు న్యాయం చేయాలని సోమవారం కలెక్టర్ రాహుల్ రాజ్‌కు బీఎంఎస్ కార్మిక సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహులు మాట్లాడుతూ.. ఏపీఎల్ అపోలో కార్మికుల సమస్యను పరిష్కరించాలని చేస్తున్న సమ్మె సోమవారం ఏడో రోజుకు చేరుకుందన్నారు. స్థానిక కార్మికులను ఢిల్లీ, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు అక్రమంగా బదిలీ చేసిందని తెలిపారు. ఎలాంటి కారణం లేకుండా కార్మికులను తొలగిస్తున్నారన్నారు. ఈ విషయంలో కలెక్టర్ చొరవ తీసుకొని గ్రామీణ కార్మికులకు న్యాయం చేయాలని వినతి పత్రం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ సంగారెడ్డి జిల్లా నాయకులు మోహన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, నర్సింలు, రాజ్‌కుమార్, చవాన్ సురేష్, పెద్దకృష్ణ తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న కార్మిక సంఘం నాయకులు

కొనుగోలు కేంద్రాలతో రైతులకు మేలు



వడియారంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు



వెల్దుర్తిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ అనంతరెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): ప్రభుత్వం పీఏసీఎస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని సొసైటీ చైర్మన్ అనంతరెడ్డి అన్నారు. ఈ మేరకు మండలంలోని మంగళపర్తి, వెల్దుర్తి, మానెపల్లి, ఎం.జలాల్‌పూర్, కుకునూర్, చెర్లపల్లి గ్రామాల్లో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. రైతులు ప్రతిఒక్కరూ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ అశోక్, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

వడియారంలో..

చేగుంట(తూప్రాన్): మండలంలోని వడియారంలో సోమవారం సహకార కేంద్రం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శివప్రసాద్ మాట్లాడుతూ రైతులు దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దన్నారు. కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ రఘురాంలు, ఎంపీడీఓ చిన్నారెడ్డి, వ్యవసాయ అధికారి హరిప్రసాద్, సీఈఓ సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా ఆర్టీసీ సేవలు

నారాయణఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశం



అల్లాదుర్గం బస్ స్టేజి వద్ద బస్సులను తనిఖీ చేస్తున్న ఖేడ్ డిపో మేనేజర్ మల్లేశం

అల్లాదుర్గం(మెదక్): ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఆర్టీసీ సేవలు అందిస్తున్నట్లు నారాయణఖేడ్ డిపో మేనేజర్ మల్లేశం అన్నారు. సోమవారం అల్లాదుర్గం బస్ స్టాప్ వద్ద ఆర్టీసీ బస్సులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగల సమయంలో ఇబ్బందులు రాకుండా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని తెలిపారు. అయితే బస్సులు సర్వీస్ రోడ్డుపై వెళ్లాలని కండక్టర్, డ్రైవర్లను చెప్పామన్నారు. అదే విధంగా అల్లాదుర్గం స్టేజి నుంచి చిల్వేరా, డాగ్ బంగ్లా, పెద్దాపూర్ గ్రామాలలో సర్వీస్ రోడ్డుపై వెళ్లి ప్రయాణికులను ఎక్కించుకోవాలని కండక్టర్‌కు తెలిపారు. ఆర్టీసీ ప్రయాణం ప్రయాణికులకు సురక్షితమని, ప్రైవేట్ వాహనాల్లో వెళ్లొద్దన్నారు. ప్రయాణికులకు ఏవైనా ఇబ్బందులు ఉంటే ఫిర్యాదు చేయాలన్నారు. ఆయన వెంట డిపో సిబ్బంది పాండు తదితరులు ఉన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



అంబేద్కర్ సంఘం నాయకులను సన్మానిస్తున్న వెంకటగౌడ్, నాయకులు

తూప్రాన్: మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు పడాలపల్లిలో అంబేద్కర్ సంఘం గ్రామ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కానుకుంట నాగేశ్వరరావు నియామకమయ్యారు. అనంతరం కార్యవర్గాన్ని అంబేద్కర్ సంఘం సభ్యులు, బ్రాహ్మణపల్లి మాజీ సర్పంచ్ వెంకటగౌడ్ సన్మానించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి, అంబేద్కర్, జ్యోతిరావు పూలే, కాన్షిరామ్ ఆశయాల కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించండి

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహ ఏర్పాటుకు ప్రభుత్వ స్థలం కేటాయించాలని దళిత సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు రామచంద్రం ఆధ్వర్యంలో తహసీల్దార్ మాలతికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా మండలంలో బాబు జగ్జీవన్‌రామ్ చిత్ర పటంతో జయంతి ఉత్సవాలు చేస్తున్నామన్నారు. స్థలం కేటాయిస్తే త్వరలోనే విగ్రహ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు సంగని సంజీవ్, మురళిమాదిగ, జనార్దన్, కర్రె సత్తయ్య, డప్పు నర్సింహులు, తొంట దుర్గపతి, సిద్దార్థ తదితరులు ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు

వైభవంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని ముత్యాల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు సోమవారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా సోమవారం గోపూజ, వరుణ యాత్ర, యాగశాల ప్రవేశం, గణపతిపూజ, పుణ్యాహవచనం, నవగ్రహ, సర్వతోభద్ర మండల దేవతాపూజలు, హోమం నిర్వహించారు. ఈ మేరకు మంగళవారం ధాన్యాదివాసం, చండీహోమం, బుధవారం యంత్ర విగ్రహ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.



ఉత్సవాల్లో భక్తులు

హెచ్‌ఎంలకు పర్యవేక్షణ బాధ్యతపై హర్షం



గాలయ్య

చిన్నశంకరంపేట(మెదక్): ప్రాథమిక పాఠశాలల పర్యవేక్షణ బాధ్యతలను ఎస్‌ఎల్‌ఎం హెచ్‌ఎంలకు అప్పగించడం హర్షణీయమని పీఎస్‌హెచ్‌ఎంల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాలయ్య అన్నారు. కొంత కాలంగా పీఎస్‌హెచ్‌ఎంల సంఘం చేసిన కృషి ఫలితంగా ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల పర్యవేక్షణ బాధ్యతలను ఎస్‌ఎల్‌ఎం హెచ్‌ఎంలతో పాటు ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. ఈ నిర్ణయం వెంటనే అమలులోకి తీసుకురావాలని ఆయన కోరారు. ప్రభుత్వ చర్యలకు కృషి చేసిన రాష్ట్ర సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మురళీధర్‌గౌడ్, రచ్చ మురళీలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి



వినతి పత్రం అందిస్తున్న బ్రహ్మం

టేక్మాల్(మెదక్): మండలంలో పలు సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను కాపాడాలని అందోల్ నియోజకవర్గ సింగూరు జలాల సాధన సమితి అధ్యక్షుడు కంచరి బ్రహ్మం సోమవారం కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30, 34, 108 సర్వే నంబర్‌లలో ప్రభుత్వ భూములు ఉన్నాయన్నారు. 2005లో ప్రభుత్వం పేద ప్రజల అభివృద్ధి కోసం సుమారు 100మందికి పైగా లబ్ధిదారులకు భూపంపిణీ చేసి పట్టాలిచ్చి కబ్జాలు చూపించలేదన్నారు. సోలార్ ప్లాంటులో విస్తరించే ఉద్దేశంతో అక్రమంగా కబ్జాలు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వానికి ఎటువంటి రుసుం చెల్లించకుండానే రూ.కోట్లల్లో సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. కావున ఈ భూములపై లబ్ధిదారులకు పొజిషన్లు చూపించే విధంగా సోలార్ ప్లాంట కబ్జాల నుంచి విడిపించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. అదే విధంగా ఎలకుర్తి, పల్వంచ, టేక్మాల్ గ్రామ శివారులలో పలు ప్రభుత్వ భూములు, నక్షబాటలు, కాల్వలు, కబ్జాకు గురయ్యాయని ఆరోపించారు.

పాఠశాలకు మైక్‌సెట్ బహూకరణ

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని ముత్తాయికోట ప్రభుత్వ పాఠశాలకు సోమవారం గ్రామానికి చెందిన పొడ్చన్‌పల్లి హరీష్‌గౌడ్ మైక్‌సెట్ అందజేశారు. అనంతరం ఎంఈఓ మధుమోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించే విధంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సదరాం, రఘుబాబు, సంతోషికుమారి, శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.



మైక్‌సెట్‌ను బహూకరిస్తున్న హరీశ్‌గౌడ్

సంక్షిప్త వార్తలు

◆ నేటి నుంచి మంజీరా నీటి సరఫరా

శివ్వంపేట(నర్సాపూర్): 15 రోజుల నుంచి నిలిచిన మిషన్ భగీరథ నీటి సరఫరా నేటి నుంచి యథావిధిగా సరఫరా కానుంది. ఇటీవల చెక్రియల్ వద్ద మంజీరా ప్రధాన పైప్‌లైన్ వరదల కారణంగా దెబ్బతినడంతో మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టారు. ఈ మేరకు సోమవారం మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల ఓవర్‌హెడ్ ట్యాంకులోకి నీటి సరఫరా జరగగా.. అక్కడి నుంచి గ్రామాల్లోని రక్షిత వాటర్ ట్యాంకులోకి నీటి సరఫరా చేశారు. దీంతో మంగళవారం ఉదయం నుంచి మండలంలోని అన్ని గ్రామాలకు నీటి సరఫరా చేస్తున్నట్లు మిషన్ భగీరథ డీఈ ప్రవీణ్ తెలిపారు.

◆ సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు

నర్సాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకంతో పేదలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. సోమవారం తన నివాసంలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు, ఎల్‌ఓసీ అందజేశారు. ఆమె వెంట పలువురు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కౌడిపల్లి(నర్సాపూర్): టీవీఎస్ ఎక్సల్‌పై నుంచి అదుపుతప్పి కిందపడిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్‌ఐ మురళి తెలిపిన వివరాల ప్రకారం.. చిలప్‌చెడ్ మండలంలోని రహీంగూడకు చెందిన జోల కిష్టయ్య ఈనెల 1వ తేదిన టీవీఎస్ ఎక్సల్‌పై చేపలు అమ్మేందుకు సలాబత్‌పూర్ వెళ్లాడు. అయితే తిరిగి వస్తుండగా మర్రి చెట్టుతండా సమీపంలో కోళ్లఫారం వద్ద వాహనం అదుపుతప్పి కిందపడగా తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని కుటుంబ సభ్యులు హైదరాబాద్ ఎర్రగడ్డ ఈఎస్‌ఐ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

◆ బీజేపీలో పలువురి చేరిక



కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని దేవులపల్లికి చెందిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కార్యకర్తలు సోమవారం ఎంపీ రఘునందన్‌రావ్ సమక్షంలో బీజేపీలో చేరారు. హైదరాబాద్‌లోని ఎంపీ నివాసంలో కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు రాజశేఖర్, భూమయ్య, రాములు, ప్రభు, లచ్చాగౌడ్, హీరాలాల్, సురెందర్, సుదర్శన్, శ్రీశైలం, వెంకటేశ్, యాదయ్య, నర్సింలు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రాజేందర్, మండలపార్టీ అధ్యక్షుడు రాకేష్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

◆ మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో 18 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపర్చగా 13 మందికి రూ.వెయ్యి, మరో ముగ్గురికి రూ.2 వేలు, ఇద్దరికి రూ.1500 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

సంగారెడ్డి రూరల్ ఎస్సైగా మధుసూదన్ రెడ్డి

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి రూరర్ పోలీస్ స్టేషన్ ఎస్సైగా మధుసూదన్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎస్సైగా పనిచేసిన రవీందర్‌పై సస్పెన్షన్ వేటు పడిన విషయం తెలిసిందే. నూతన ఎస్‌ఐకి స్టేషన్ సిబ్బంది శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

నీరే ప్రాణకోటికి జీవనాధారం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): భూమిపై జీవిస్తున్న ప్రాణకోటికి నీరే జీవనాధారమని, అలాంటి నీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని హెచ్‌ఎం రామకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని నిజాంపూర్ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో నిర్మించిన ఇంకుడు గుంతను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్‌లో రానున్న నీటి సమస్యను ఎదుర్కొనేందుకు ప్రతి ఇంటి ముందు ఇంకుడు గుంతను నిర్మించుకోవాలని సూచించారు. ప్రతి వర్షపు నీటిబొట్టును ఒడిసిపట్టేందుకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తే పెద్ద మొత్తంలో భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. కరువు పరిస్థితుల్లో కూ డా బావులు, బోర్లలో నీరు లభించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, నవనీత పాల్గొన్నారు.

కనిపించని సూచిక బోర్డులు



శివ్వంపేటలో సూచిక బోర్డులు లేని డివైడర్

- పెరుగుతున్న ప్రమాదాలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

శివ్వంపేట(నర్సాపూర్): వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే 161ఏఏ రహదారిపై సూచక బోర్డులు కనిపించడం లేదు. దీంతో ప్రమాదకర మలుపులు ఉన్న చోట్ల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. తూప్రాన్- నర్సాపూర్ రహదారిపై పలుచోట్ల మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. అయితే రహదారిపై అవసరమున్న చోట గతంలో ఏర్పాటు చేసిన సూచిక బోర్డులకు పిచ్చి మొక్కలు అడ్డంకిగా మారాయి. మండల కేంద్రంలో కిలోమీటర్ మేరా రోడ్డు విస్తరణ చేపట్టి మధ్యలో డివైడర్ నిర్మించారు. ఇరు వైపుల డిప్పర్ లైట్లు ఏర్పాటు చేయడంలో సంబంధిత హైవే సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అదే విధంగా పోలీస్‌స్టేషన్ ఎదుట మూలమలుపు ఉండడంతో పాటు అక్కడే డివైడర్ ప్రారంభం కావడంతో వాహనాదారులకు కనిపించని పరిస్థితి నెలకొంది. ఇటీవల ఓ లారీ ప్రమాదానికి గురైంది.

గుంతలమయంగా రోడ్డు..

తూప్రాన్ నుంచి నర్సాపూర్ వరకు హైవే రోడ్డుపై చాలాచోట్ల భారీ గుంతలు ఏర్పడ్డాయి. గుంతలు పూడ్చి మరమ్మతులు చేపట్టడంలో సంబంధిత శాఖ సిబ్బంది పూర్తిగా విఫలమయ్యారు. దీంతో రోడ్డు మధ్యలో గుంతలు ఏర్పడి పలు వాహనదారులు అదుపుతప్పి గాయాల పాలయ్యారు. కావున రోడ్డుపై నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.



ప్రమాదానికి గురైన లారీ(ఫైల్)

మరమ్మతులు చేయిస్తాం

తూప్రాన్-నర్సాపూర్ రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చి వేసేందుకు చర్యలు తీసుకుంటాం. శివ్వంపేటలో డివైడర్ ప్రారంభ దశలో డిప్పర్ లైట్లు, పలుచోట్ల సూచిక బోర్డులు ఏర్పాటు చేయిస్తే ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.

– రామకృష్ణ, డీఈ